అనుభవించడం కోల్పోయి, వేలుకే బందీలైపోయారు. అంటే మీరు మతాన్ని వివాహం చేసుకుని దేవుడికి విడాకులిచ్చేసారు."

"మమ్మల్ని ఏం చేయమంటారు స్వామి?"

ఆ సాధువు రకరకాల ఆధ్యాత్మిక సాధనల గురించి వారికి బోధించాడు.

## 35. కోపధారి

కోపధారి మనిషి అయిన తన చిన్న కొడుకు అందరి మీదా నోరు పారేసుకోవడం గమనించిన ఓ తండ్రి ఓ రోజు అతన్ని ఇంటి వెనక ఉన్న గోడ దగ్గరకి తీసుకెళ్ళాడు.

అతని చేతికి ఓ సుత్తి, కొన్ని మేకులున్న సంచీ ఇచ్చి చెప్పాడు.

"ఇకనించి నీకు ఎవరి మీదైనా కోపం వచ్చి వాళ్ళని తిట్టినప్పుడల్లా ఆ గోడ మీద ఓ మేకుని కొడుతూండు. నువ్వు అలా ఒక్క మేకు కూడా కొట్టాల్సిన అవసరం రాని రోజు ఆ సంగతి నాకు చెప్పు."

అందుకా కొడుకు అంగీకరించాడు. మొదటి రోజు అతను గోడ మీద ముప్ఫై ఏడు మేకులు కొట్టాడు. మర్నాడు ముప్ఫై తొమ్మిది. కొద్ది రోజులు గడిచే కొద్దీ అతను గోడ మీద కొట్టే మేకుల సంఖ్య క్రమేపీ తగ్గు ముఖం పట్టింది. కొన్ని నెలల తర్వాత అతని తండ్రి ఆశించినట్లుగా, అతను ఎవర్నీ కోపంతో తిట్టని రోజు ఒకటి వచ్చింది. ఆ రోజు గోడ మీద ఒక్క మేకు కూడా కొట్టలేదు. అతను ఆనందంగా వెళ్ళి తండ్రికి చెప్పాడు.

"నాన్నా! నేను గత వారం రోజులుగా గోడ మీద ఒక్క మేకు కూడా కొట్టలేదు."

అతను ఎదురు చూసినట్లుగా తండ్రి అతన్ని అభినందించలేదు. తన కొడుకుని ఆయన ఇంటి వెనక గోడ దగ్గరకి తీసుకు వెళ్ళి చెప్పాడు.

"ఇన్నాళ్ళుగా నువ్వు కొడుతున్న ఆ మేకులన్నిటినీ పీకేయ్."

కొడుకు వెంటనే తండ్రి చెప్పినట్లుగా చేసాడు. తర్వాత తండ్రి తన కొడుకుతో చెప్పాడు.

"నీ కోపం నీ ఆధీనంలోకి రావడం నేను సంతోషించే విషయం. కాని ఓ సారి ఆ గోడని చూడు."

కొడుకు ఆ గోడ వంక చూస్తే పూర్వం సాఫీగా ఉన్న గోడ మీద మేకులు పీకిన రంధ్రాలు కనిపించాయి. తర్వాత తండ్రి చెప్పిన ఈ మాటలు విన్నాడు.

"ఆ గోడ ఎప్పటికీ అలాగే ఉంటుంది తప్ప ఇదివరకటిలా మారదు. అలాగే నువ్వు కోపంతో తిట్టినవారి మనసులు కూడా ఈ గోడలానే గాయపడి ఉంటాయి. ఓ సారి నువ్వు ఓ మనిషి ఛాతీలో కత్తితో పొడిచి, ఆ తర్వాత ఎన్నిసార్లు అతనికి క్షమాపణలు చెప్పినా ఆ గాయం మానదు. భౌతికంగా శరీరానికి కలిగే గాయం ఎలాంటిదో, ద్వేషం ద్వారా మనం ఇతరుల మనసుల్లో కలిగించే గాయాలు కూడా అలాంటివే సుమా!"

## 36. పలకరింపు

ఓ ఆశ్రమాన్ని సందర్శించిన ఓ సందర్శకుడు తన బూట్లని విప్పకుండా ప్రవచనం చెప్పే చోటికి వెళ్ళి కూర్చున్నాడు. ఓ వాలంటీర్ అతని దగ్గరకి వచ్చి చెప్పాడు.

"ఓం నమశ్శివాయ! ఇక్కడ బూట్లని ధరించకూడదు. బయట వదలండి."

సరే అన్నట్లుగా అతను తల వూపాడు కాని కదల్లేదు. కొద్ది నిముషాల తర్వాత స్వామి వారి శిష్యుడు వచ్చి అతనితో చెప్పాడు.

"ఓం నమశ్శివాయ! మీరిక్కడ బూట్లని ధరించకూడదు. బయట ఈ సంగతి బోర్డు కూడా పెట్టాం. వెళ్ళి విప్పి రండి."

అతను నవ్వుతూ తలవూపాడు కాని లేచి వెళ్ళలేదు.

కొద్ది సేపటికి స్వామి ప్రధాన శిష్యుడు వచ్చి అతనితో చెప్పాడు.

"ఓం నమశ్శివాయ! మీరిక్కడికి స్వామి వారి ప్రవచనం వినడానికి రావడం నాకెంతో సంతోషంగా వుంది. దయచేసి బూట్లని బయట విప్పి వస్తారా?"

"తప్పకుండా. కాని నేను ఇక్కడికి చాలా నెలలుగా వస్తున్నాను. ఇంతదాకా మీ ఆశ్రమంలోని ఒక్క మనిషి కూడా నన్ను పలకరించ లేదు. కనీసం పలకరింపుగా